నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, శుక్రవారం 5 జనవరి 2024 | PEDDAPALLI

## వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయండి : సీపీ

రాంనగర్, డిసెంబర్ 4: మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో సూచించారు. షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని, ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై జిల్లాలో అవగాహన కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్‌లో షీటీంకు 11 ఫిర్యాదులు అందాయని, వాటిలో 9 పెట్టి కేసులు, 3 కౌన్సెలింగ్, ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, అలాగే 65 హాట్ స్పాట్స్‌ని విజిట్ చేస్తూ, 28 అవర్నేస్ ప్రోగ్రాంల ద్వారా విద్యార్థులకు, షాపింగ్ మాల్స్ ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే మహిళలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. షీ టీంకి మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బీ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా ఉంటారని, నేరుగా సంప్రదించలేని వారు 87126 70759, డయల్ 100కు, లేదా షీటీం క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



నీల వర్ణం.. మానేరు జలాశయం

కరీంనగర్ శివారులోని లోయర్ మానేరు జలాశయం వివిధ వర్ణాల్లో నిత్యం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. డ్యాం గేట్ల పై భాగంలో ఏర్పాటు చేసిన విద్యుత్ బల్బులు జలాశయానికి కొత్త అందాలను తెచ్చి పెడుతున్నాయి. ఈ క్రమంలో గురువారం వేకువజామున లైట్ల వెలుగుల్లో నింగి నేల నీలి వర్ణంలో దర్శనమివ్వగా 'నమస్తే' తన కెమెరాలో బంధించింది.

- కరీంనగర్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ



# పంతుళ్లకు పరీక్ష!



**విద్యార్థులకు పాఠాలు చెప్పి పరీక్షలు రాయించిన గురువులను ఇన్నాళ్లు చూశాం. కానీ, ఆ పంతుళ్లే ఇప్పుడు పరీక్ష రాయాల్సి వస్తున్నది. ఉద్యోగోన్నతులు రావాలన్నా.. ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలన్నా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత తప్పక సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యువ ఉపాధ్యాయుడు నుంచి ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయుడి వరకు దాదాపుగా అందరూ ఈ పరీక్ష రాయాల్సిన అవసరం కనిపిస్తున్నది. పాఠశాల విద్యారంగాన్ని పటిష్టం చేయాలన్న లక్ష్యంతో జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ), టెట్‌ను తప్పనిసరి చేస్తుండగా, ఉపాధ్యాయుల్లో అలజడి రేగుతున్నది. ఉమ్మడి జిల్లాలో 13 వేల మంది టీచర్లు పనిచేస్తే దాదాపు 8 వేల మంది ఈ పరీక్ష రాసి అర్హత పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో ఎవరికీ మినహాయింపు ఉండదని అటు కేంద్రం, ఇటు రాష్ట్రం స్పష్టం చేస్తున్నది.**

**అలజడి రేపుతున్న 'టెట్'**

- ప్రభుత్వోపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరి
- ప్రమోషన్లకైనా.. ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలన్నా టెట్ ఉండాల్సిందే?
- ఉమ్మడి జిల్లాలో 8వేల మందికిపైగా పరీక్ష రాయాల్సిన అవసరం
- అప్పటి వరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఉంటుందా..? లేదా..? అన్న సందేహం
- అవకాశం ఇచ్చాకే ప్రక్రియ ప్రారంభించాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- ప్రమోషన్లు ఇవ్వాల్సిందేనంటున్న టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు



కరీంనగర్, జనవరి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేశంలోని చాలా రాష్ట్రాల్లో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు బీఈడీ, టీటీసీ వంటి కోర్సులు పెట్టి సర్టిఫికెట్లు ఇస్తున్నాయి. అయితే, వాటి ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన చాలా మందిలో బోధనకు తగినంతగా పరిణితి లేదని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) 2010లో టెట్‌ను తెరపైకి తెచ్చింది. ఉపాధ్యాయ ఉద్యోగం పొందాలన్నా, ఉద్యోగం వచ్చిన తర్వాత ఉద్యోగోన్నతి పొందాలన్నా.. టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి చేసింది. ఈ మేరకు 2010లోనే నిబంధనలను నిర్దేశించింది. ఈ అర్హత సాధించడానికి 2015వరకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత మరో ఐదేళ్లు పొడిగిస్తూ 2019 వరకు అవకాశం ఇస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా చేపడుతున్న నియామకాల్లో ఈ నిబంధనను అమలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ, పదోన్నతులకు మాత్రం ఇన్నాళ్లుగా వర్తింప చేయలేదు. అయితే ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం టెట్ ఉత్తీర్ణత సాధించిన వారికే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని పలువురు టీచర్లు కొద్ది నెలల క్రితం హైకోర్టును ఆశ్రయించడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. ఆ మేరకు ప్రమోషన్ పొందేందుకు టెట్‌లో పాస్ అయిన వారితో సీనియారిటీ జాబితా సమర్పించాలని గతేడాది సెప్టెంబర్ 27న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ప్రమోషన్లకు బ్రేక్ పడింది. ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని నాటి కేసీఆర్ ప్రభుత్వం.. ఇప్పటికిప్పుడు టెట్ నిర్వహించడం సాధ్యం కాదని, ఈ సారి పాత నిబంధనల ప్రకారమే ఉద్యోగోన్నతులు నిర్వహించే అవకాశం ఇవ్వాలని, అలాగే ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించడానికి కొంత సమయం ఇవ్వాలని కోరుతూ ఎన్‌సీటీఈకి లిఖిత పూర్వక లేఖ రాసింది. ఎన్‌సీటీఈ దానిని అంగీకరించకుండా కచ్చితంగా టెట్ అర్హత ఉన్నవారికే పదోన్నతులు ఇవ్వాలని తిరిగి ప్రభుత్వానికి లేఖ రాసింది. ఓవైపు హైకోర్టు ఆదేశాలు, మరోవైపు ఎన్‌సీటీఈ ఒప్పుకోకపోవడంతో ప్రస్తుతం టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. నిజానికి 2010లోనే ఈ నిబంధనలు అమల్లోకి వచ్చినా ఇప్పటివరకు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎక్కడా కూడా ప్రమోషన్లకు టెట్ అర్హత తప్పనిసరని లేదు. అంతే కాకుండా టెట్ అర్హత సాధించడానికి గరిష్ఠ వయసు 45 ఏండ్లలోపు ఉండాలని పేర్కొన్నది. దీంతోపాటు ఇన్నాళ్లుగా కేంద్రం కూడా ఈ విషయంలో ఒత్తిడి తేకపోవడంతో అంతా మామూలుగానే నడిచింది.

### స్పష్టత అవసరం

ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో మొత్తం 150 మార్కులకు గాను ఓసీలు 90 మార్కులు (60 శాతం).. అలాగే బీసీలు 75 మార్కులు (50 శాతం), ఎస్సీ, ఎస్టీలు 60 మార్కులు (40 శాతం) సాధిస్తేనే ఉత్తీర్ణత అయినట్లుగా భావిస్తారు. ఇప్పుడు పదోన్నతులకు నిర్వహించే టెట్‌కు ఇదే విధానం పాటిస్తారా..? లేక అందులో ఏమైనా మార్పులు, చేర్పులు చేస్తారా..? అన్న అంశంపై క్లారిటీ రావాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, అందరితో పాటే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారు టెట్ రాయాలా? లేక సర్వీసులో ఉన్నవారికి ప్రత్యేకంగా ఏమైనా నిర్వహిస్తారా..? అన్న అంశంలోనూ స్పష్టత రావాల్సి ఉన్నది. ఒకవేళ ప్రత్యేకంగా నిర్వహించాలనుకుంటే.. దానికి ఎన్‌సీటీఈ అనుమతి ఇస్తుందా..? లేదా..? అన్నది సందేహమే. ప్రస్తుతమున్న ఉపాధ్యాయుల వివరాలను బట్టి చూస్తే.. 2010, 2011, 2012, 2017 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించారు. నిజానికి 2010 నుంచి టెట్ తప్పనిసరి చేసినా.. 2005, 2008 డీఎస్సీలో నియామకమైన ఉపాధ్యాయుల్లోనూ చాలా మంది ఆ తర్వాత టెట్ అర్హత సాధించి ఉద్యోగంలో కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. అంతకుముందు నియమితులైన టీచర్లు ఈ టెట్ అర్హత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ లెక్కన చూస్తే.. ప్రతి జిల్లాలో ఇప్పటికే టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు కేవలం 30 శాతం ఉంటే.. టెట్ అర్హత సాధించాల్సిన ఉపాధ్యాయులు సుమారు 70శాతం ఉంటారని అధికారవర్గాల ద్వారా తెలుస్తున్నది. మొత్తంగా టెట్ వ్యవహారంపై ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది.

### ఉపాధ్యాయుల్లో అలజడి

ఇక ముందు ప్రమోషన్లు పొందే టీచర్లు మాత్రమే టెట్ అర్హత సాధిస్తే సరిపోతుందని చాలా మంది భావిస్తున్నారు. కానీ, నిబంధనలను లోతుగా చూస్తే.. ఇంక్రిమెంట్ల వంటి ప్రయోజనాలు పొందాలంటే కూడా విధిగా టెట్ అర్హత ఉండాల్సిందే. ఈ విషయమే ప్రతి ఒక్కరిలో ఆందోళనకు కారణమవుతున్నది. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుల నుంచి రెండు రకాల డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉన్నాయి. ఇప్పటికే టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు ఒక సంఘంగా ఏర్పడి.. ఉద్యోగోన్నతుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం టెట్ అర్హత సాధించిన వారితో సీనియారిటీ జాబితా తయారు చేసి.. వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, మెజార్టీ ఉపాధ్యాయ సంఘాలు మాత్రం కొంత సమయం ఇచ్చి టెట్ నిర్వహించాలని, ఆ తర్వాతే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ సమస్యను పరిష్కరించాలంటే.. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధికారులతో ఒక సమన్వయ కమిటీ వేసి, అక్కడ తీసుకునే నిర్ణయాల ప్రకారం పదోన్నతుల ప్రక్రియలో ముందుకెళ్తే బాగుంటుందని పేర్కొంటున్నాయి. అలా కాకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే.. ఈ ప్రక్రియ మళ్లీ వివాదాస్పదం అవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటున్న దానిపై ఉత్కంఠ నెలకొన్నది. ఇటు ఉపాధ్యాయుల్లోనూ అలజడి కనిపిస్తున్నది.

# ఆర్‌వీఎం ఆర్డర్లు వచ్చేనా?

- ముంచుకొస్తున్న గడువు
- నవంబర్‌లోనే రావాల్సిన విద్యార్థుల యూనిఫాం తయారీ ఆర్డర్లు
- ఎన్నికల షెడ్యూల్‌తో ఆగిన ప్రక్రియ
- సర్కారు మారడంతో ఇప్పటికీ రాని ఆర్డర్లు
- ఉపాధిపై సన్నగిల్లుతున్న నేతన్నల ఆశలు
- ఆందోళనలో 30 వేల మంది వస్త్ర పరిశ్రమ కార్మికులు



రాజన్న సిరిసిల్ల, జనవరి 4(నమస్తే తెలంగాణ): విద్యార్థుల యూనిఫాం దుస్తుల తయారీ (ఆర్‌వీఎం) ఆర్డర్లపై సందిగ్ధం నెలకొన్నది. గత నవంబర్‌లో రావాల్సిన ఆర్డర్లు ఎన్నికల షెడ్యూలుతో ప్రక్రియ ఆలస్యం కాగా, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆర్డర్లు రాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం 2021 నుంచి రాజీవ్ విద్యామిషన్‌కు సంబంధించి వస్త్ర ఆర్డర్లు సిరిసిల్లకే ఇవ్వడంతో 15 వేల మంది కార్మికులకు ఉపాధి లభించింది. 18 వేల మరమగ్గాలపై దాదాపు 90 లక్షల మీటర్ల ఉత్పత్తి చేసి మార్చినెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యా సంవత్సరం ప్రారంభంతోనే విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించాల్సి ఉండగా, ఈసారి ఆర్డర్లు వస్తాయా? లేదా? అన్న మీమాంసలో పవర్‌లూం యజమానులుండగా, ఉపాధిపై నేతన్నల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పరిశ్రమలో పనిచేసే నేతన్నలకు చేతి నిండా పని కల్పించేందుకు బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్, ఆర్‌వీఎం వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇచ్చి వారి బతుకులకు భరోసా నిచ్చింది. 25 వేల మరమగ్గాలపై బతుకమ్మ చీరలు, 18 వేల మరమగ్గాలపై ఆర్‌వీఎం దుస్తులు తయారయ్యేవి. సుమారు 30 వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించింది. మొత్తంగా కేసీఆర్ సర్కారు రూ.3వేల కోట్ల వస్త్ర ఆర్డర్లు ఇచ్చింది. అప్పటి ప్రభుత్వంలో చేనేత జౌళిశాఖ మంత్రిగా కేటీఆర్ ఉండడం వల్లే ఇది సాధ్యమైంది. 2021 సంవత్సరం నుంచి వరుసగా వస్త్ర ఆర్డర్లు ఇస్తూ వచ్చింది. ఏప్రిల్‌లో కోటి చీరల బతుకమ్మ ఆర్డర్లు ఇచ్చేది. తయారీ లక్ష్యం సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. నవంబర్‌లో ఆర్‌వీఎం విద్యార్థుల యూనిఫాంల తయారీ ఆర్డర్లు వచ్చేది. నవంబర్‌లో ఉత్పత్తులు ప్రారంభించి మార్చికల్లా లక్ష్యాన్ని పూర్తి చేసేది. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ విద్యార్థులకు దుస్తులు కుట్టించి అన్ని పాఠశాలలకు సరఫరా చేసేది. అయితే, ఈ నవంబర్‌లో ఎన్నికలు రావడంతో ఆర్డర్ల ప్రక్రియ ఆగిపోయింది. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు ఆర్డర్లు రాలేదు. పైగా ఉత్పత్తి చేయాల్సిన మార్చి గడువు మరో రెండు నెలలే ఉంది. 90లక్షల మీటర్లు ఆరు నెలల్లో తయారు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు దీనిపై అధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో అటు వస్త్ర ఉత్పత్తిదారులు, ఇటు కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆర్డర్లు వస్తాయా? రావా? అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సమయానికి యూనిఫాంలు ఎలా అందిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### బంద్ పడ్డ సాంచాలు

తెలంగాణ వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం ఇచ్చే వస్త్ర ఆర్డర్లపైనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నడుస్తున్నది. మూడంచెల వ్యవస్థ కలిగిన ఈ పరిశ్రమలో యజమానులు, ఆసాములు, కార్మికులు వేల సంఖ్యలో ఉన్నారు. పదేండ్ల కింద ఉమ్మడి ప్రభుత్వంలో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. వందల సంఖ్యలో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆకలి చావులకు గురయ్యారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పరిశ్రమకు చేయూతనిచ్చి కార్మికులకు అండగా నిలిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నడిచిన పరిశ్రమ ప్రభుత్వం మారడంతో పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆర్‌వీఎం ఆర్డర్లు 2021 సంవత్సరంలో 130.91 లక్షల మీటర్లు, 2022 లో 98.24 లక్షల మీటర్లు, 2023లో 89.11 లక్షల మీటర్ల ఆర్డర్లు ఇచ్చింది. కాగా, రెండు నెలల కిందటే సర్కారు నుంచి రావాల్సిన ఆర్డర్లు రాకపోవడంతో కొన్ని సాంచాలు బంద్ పడ్డాయి. పాలిస్టర్ వస్త్రాలు తయారు చేస్తున్నప్పటికీ, మీటరుకు రూపాయి నష్టం రావడంతో యజమానులు బంద్‌పెట్టినట్లు చెబుతున్నారు. అసలు ఆర్డర్లు వస్తాయా? రావా? అన్న ఆందోళన పరిశ్రమ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. మూడు రోజులుగా టెక్స్‌టైల్స్ పార్కులో యజమానులు పరిశ్రమలు బంద్ పెట్టారు. సొంతంగా తయారు చేసిన వస్త్రాలకు గిరాకీ లేకపోవడం, నిలువలు పేరుకుపోవడం వల్ల యూనిట్లు బంద్ పెట్టారు. వెంటనే ఆర్డర్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



సిరిసిల్ల కలెక్టరేట్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు

# గురుకులాల్లో దరఖాస్తులకు రేపే ఆఖరు

- ఐదో తరగతిలో ప్రవేశాలు
- వచ్చే నెల 11న పరీక్ష
- ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల పిలుపు
- సిరిసిల్లలో పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్/ పెద్దపల్లి కమాన్, జనవరి 4 : ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 2024 –25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఈ నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి ఎం గౌతమ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చే నెల 11న ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని జిల్లాల్లో ఎంపిక చేయబడిన కేంద్రాల్లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ₹100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే ఇవ్వాలని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2023 – 24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదివి ఉండాలని, నాలుగో తరగతి ధ్రువీకరణ పత్రం బోనఫైడ్‌ను దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. విద్యార్థుల ఎంపిక పాత జిల్లా ఒక యూనిట్‌గా పరిగణించి చేస్తారని, ఇతర సమాచారం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1800 425 45678కు లేదా సంబంధిత జిల్లా ప్రధాన ఆచార్యులను సంప్రదించాలని కోరారు. అలాగే సిరిసిల్ల కలెక్టరేట్‌లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులకు సంబంధించి ప్రచార పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో ఎం దశరథం, సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయకర్త జాక్విలిన్ ఆవిష్కరించారు.

# బంగారు భవితకు తొలిమెట్టు

- పకడ్బందీగా అమలు చేయాలి
- పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



అప్పన్నపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతున్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామిల్‌ఖాన్

పెద్దపల్లి రూరల్, జనవరి 4: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచేలా చేపట్టిన తొలిమెట్టును పకడ్బందీగా అమలు చేయాలని, ఇది పిల్లల భవితకు బంగారు బాటలు వేస్తుందని పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లి మండలం అప్పన్నపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై సంబంధిత అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు రకాల అంశాలపై కార్యక్రమంలో ఎంఈవో సురేందర్‌కుమార్, హెచ్‌ఎం పురుషోత్తం, సీఆర్‌పీలు ఉన్నారు.

# వీఆర్‌ఏలకు ఎంప్లాయి ఐడీలు

- ఒక్కరోజులోనే ఎనిమిది మండలాల సిబ్బందికి కేటాయింపు
- మిగతావారికి రెండు రోజుల్లో పూర్తి

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 4: వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటైన గ్రామ రెవెన్యూ సహాయకులకు ఎంప్లాయి ఐడీల కేటాయింపు కరీంనగర్ జిల్లాలో చకచకా కొనసాగుతున్నది. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడడమే తరువాయి, వీఆర్‌ఏలు ప్రస్తుతం తాము విధులు నిర్వహిస్తున్న శాఖల ద్వారా జిల్లా కోశాగార కార్యాలయానికి దరఖాస్తులు చేసుకోవడం ప్రారంభించారు. వారి వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సబ్‌ట్రెజరీ కార్యాలయాలకు పంపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జీవో నంబర్ 81, 85కు అనుగుణంగా జిల్లాలోని వీఆర్‌ఏలు ఇతర శాఖల్లో సూపర్‌న్యూమరీ పోస్టుల ద్వారా గతేడాది జూలై 24న సర్దుబాటయ్యారు. వారి విద్యార్హతలను బట్టి గ్రేడ్ వన్ సర్వీసెస్, రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే, రెవెన్యూ శాఖలోని కొంతమంది ఆఫీస్ సబార్డినేట్లు కోర్టుకు ఎక్కడంతో వీరికి ఎంప్లాయి ఐడీలు ఇవ్వలేకపోయారు. గత నవంబర్‌లో కోర్టు కేసు కొట్టి వేసింది. శాసనసభా ఎన్నికల నేపథ్యంలో అప్పటికే ఎన్నికల కోడ్ కొనసాగుతుండగా, ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది. నాలుగు రోజుల క్రితం వీఆర్‌ఏలకు ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో కొద్ది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వీరి ఫైలుకు బుధవారం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ, మెమో విడుదల చేసింది. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీఆర్‌ఏలకు ఎంప్లాయి ఐడీలు ఇవ్వాలంటూ జిల్లాల్లోని ట్రెజరీ అధికారులను లిఖిత పూర్వకంగా ఆదేశించారు. జిల్లాలో 442 మంది వీఆర్‌ఏలు ఇతర శాఖల్లో సర్దుబాటు కాగా, వీరిలో అత్యధికులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. ఎనిమిది మండలాలకు చెందిన ఉద్యోగులకు ఎంప్లాయి ఐడీలు కేటాయించినట్లు జిల్లా కోశాధికారి నాగరాజు తెలిపారు. మిగతావారికి శుక్రవారం వరకు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా దరఖాస్తు చేసుకోని వారుంటే వెంటనే చేసుకోవాలని కోరారు. అలాగే, ఇతర కారణాలతో ఏ శాఖలో చేరని వారికి, ఉద్యోగోన్నతి నిలిచిన వీఆర్‌ఏలకు గౌరవ వేతనం చెల్లించాలంటూ ఉత్తర్వులు విడుదలైనట్లు డీటీవో పేర్కొన్నారు.




వెల్లుల్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

# మీకు అండగా ఉంటా

- ప్రభుత్వం లేదని అధైర్య పడొద్దు
- ప్రజల పక్షాన గొంతుకను వినిపిస్తా
- రాబోయే ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- వెల్లుల్లలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ కృతజ్ఞత సభ

మెట్‌పల్లి రూరల్, జనవరి 4: బీఆర్‌ఎస్ అధికారంలో లేదని కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దని, మీ అందరికీ అండగా ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల భరోసానిచ్చారు. రాబోయే స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని వీఆర్‌ఎం గార్డెన్స్‌లో గురువారం జరిగిన బీఆర్‌ఎస్ కోరుట్ల నియోజకవర్గ కృతజ్ఞత సభకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కాగా, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గ ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తానని స్పష్టం చేశారు. తన గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ధైర్యమిచ్చారు. అధికారంలో లేమని కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ అమలు చేయకుంటే బీఆర్‌ఎస్ తరఫున పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు సుజాత, లావణ్య, ఎంపీపీలు మారు సాయిరెడ్డి, కాటిపెల్లి సరోజ, పార్టీ మండలాధ్యక్షులు నల్ల తిరుపతిరెడ్డి, ఎల్లాల దశరథ్‌రెడ్డి, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు, నాయకులు

